క్లుప్తంగా

16న 'చలో అసెంబ్లీ'

నకిరేకల్ : నిరుద్యోగం, మాదకద్రవ్యాలు, మద్యం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీవైఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 16 చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడుతున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడోజు వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి బీవిచారి తెలిపారు. శుక్రవారం స్థానిక యానాల మల్లారెడ్డి స్మారక భవనంలో జరిగిన ఆ సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణలో నిరుద్యోగ సమస్య రోజు రోజుకూ తీవ్రతరం అవుతోందన్నారు. చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పీవైఎల్ నాయకులు బండారు వెంకన్న, పిట్టల అనిల్, చెరుకు సైదులు వీరంజానేయులు, సతీష పాల్గొన్నారు.

శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

నల్లగొండ టౌన్: నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగుల కుటుంబ సభ్యులకు శుక్రవారం శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 150 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శివ లీల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పేదవారికి తమ పుట్టినరోజు, పెళ్లి రోజుల సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పోతులపాటి మీనాకుమార్, నాగమణి పోతులపాటి మంజునాథ శర్మ, కమల, కష్ణమూర్తి, అలివేలు పాల్గొన్నారు.

23 నుంచి ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : సిద్దిపేటలో ఈ నెల 23 నుంచి 25వరకు ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని ఆ సంఘం జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎన్జీ కాలేజీలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏబీవీపీ పోరాడుతుందని పేర్కొన్నారు. మహాసభలకు విద్యార్థులు, మేధావులు, నిరుద్యోగులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు విగ్నేష్, శివాజీ, చరణ్, నవీన్, గాంధీ పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీల నియామకం


సమావేశంలో పాల్గొన్న నాయకులు

నకిరేకల్ : బీజేపీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు యానాల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. నకిరేకల్ మండలం తాటికల్ గ్రామంలో మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నూతన బూత్ కమిటీలను నియమించారు. వివిధ బూత్ కమిటీ అధ్యక్షులుగా కారింగు శ్రీనివాస్, చనగాని పెద్ద సైదులు, చనగాని చిన్నసైదులను నియమించారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి చనగాని రాములు, నాయకులు బండమీది శ్రీకాంత్, రమేష్, శ్రవణ్, జానయ్య, సాయిలు, లక్ష్మయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

తిప్పర్తి : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నల్లగొండ మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జాకటి మోష, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు భిక్షపతి, ఉపాధ్యాయులు సదానందం, సెక్రటరీ నర్సింహస్వామి, వ్యాయమ ఉపాధ్యాయులు అనురాధ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

మిర్యాలగూడ : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ హెచ్చరించారు. శుక్రవారం మిర్యాలగూడ శివారులోని సర్వే నంబర్ 60, 61లలోని 12.14ఎకరాల సీలింగ్ ల్యాండ్ ఉందని, 1978లో కొంతమంది రైతులకు సాగు చేసుకోవడానికి ఇచ్చినట్లు తెలిపారు. ఆ భూమిని అమ్మడం, కొనుగోలు చేయకూడదన్నారు.1.18ఎకరం ఖాళీ భూమిని గుర్తించినట్లు తెలిపారు. ఆ భూమిని ఎవరూ ఆక్రమించకుండా రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ హరిబాబు, ఆర్ఐ ఠాకూర్ రామకృష్ణ, సర్వేయర్ ఖాద్రి ఉన్నారు.

ముద్దలు.. ముద్దలుగా


గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ముద్దలుగా మారిన అన్నం


చండూరు కేజీబీవీలో అన్నం ఇలా..

- మధ్యాహ్న భోజనం తినలేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పాఠశాలలకు కొత్త బియ్యం సరఫరా చేస్తుండడంతోనే సమస్య
- నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని కోరుతున్న హెచ్ఎంలు

చండూరు (గట్టుప్పల్) : ప్రభుత్వ పాఠశాలలకు కొత్త బియ్యం సరఫరా చేస్తుండడంతో మధ్యాహ్న భోజనం ముద్దలు ముద్దలుగా మారుతోంది. ఆ భోజనాన్ని తినలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి చండూరు మండలంలోని పాఠశాలల్లో నెల రోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నా అధికారులు సమస్యను పరిష్కరించడం లేదని విమర్శలు వస్తున్నాయి. బియ్యం సరిగా లేవని, నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలు సంబంధిత అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. శుక్రవారం చండూరు కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి తనిఖీ చేయగా ఇదే విషయం వెలుగుచూసింది. రెండు రోజులుగా చండూరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం ముద్దలుగా మారితే దానిని పడవేసి.. మరో సారి వండి విద్యార్థులకు పెట్టారు.

ప్రతి నెలా 300 క్వింటాళ్ల బియ్యం సరఫరా

ఉమ్మడి చండూరు మండలం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజనానికి ప్రతినెలా సుమారుగా 300 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తున్నారు. ఆ బియ్యం కొత్తవి కావడంతో అన్నం ముద్దలుగా మారుతోంది. చండూరు ఉన్నత, కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల, మండల పరిషత్ ప్రాథమిక, బోడంగిపర్తి ఉన్నత, తేరట్‌పల్లి మండల పరిషత్ ప్రాథమిక, గట్టుప్పల్ ఉన్నత పాఠశాలలతో పాటు మరికొన్నింటిలో మధ్యాహ్న భోజనం ముద్దలుగా మారుతోందని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఆ భోజనాన్ని విద్యార్థులు తినలేక పడేస్తున్నారని చెబుతున్నారు. బియ్యం నాణ్యతగా లేవని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తహసీల్దార్లు, మండల విద్యాధికారులకు ఫిర్యాదు చేస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు.

తినలేకపోతున్నాం



మధ్యాహ్న భోజనం మెత్తగా, ముద్దలు ముద్దలుగా అవుతోంది. అన్నం తినలేక పోతున్నాం. మంచి బియ్యంతో వండి పెట్టాలి. గతంలో ఎప్పుడు అన్నం ఇలా కాలేదు. నెల రోజులుగా ఇలానే అవుతుంది.

– తలారి నాని, విద్యార్థి, తేరట్‌పల్లి

అధికారుల దృష్టికి తీసుకుపోయాం



బియ్యం బాగా లేవు.. అన్నం ముద్దలుగా మారుతుందని అధికారుల దృష్టికి తీసుకుపోయాం. బియ్యం వాపస్ తీసుకొని.. వేరే బియ్యం సరఫరా చేయమని చెప్తూనే ఉన్నాం. ఇటీవల ఎంఈఓ అమృతాదేవి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి ఈ విషయాన్ని గుర్తించారు. ముద్దల అన్నం విద్యార్థులు తినలేక పోతున్నారు.

– వెంకటేశ్వర్‌రావు, హెచ్ఎం, తేరట్‌పల్లి

అధికారులకు ఫిర్యాదు చేశా



మధ్యాహ్న భోజనం ముద్దలుగా మారుతుందని ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకుపోయా. సరఫరా చేసిన బియ్యం నాణ్యతగా లేవు..తిరిగి వాపస్ తీసుకొని వేరే బియ్యం సరఫరా చేయాలని తహసీల్దార్లకు చెప్పా. తనిఖీలో అన్నం ముద్దలుగా మారిన విషయం గమనించా.

– సుధాకర్‌రెడ్డి, ఎంఈఓ, చండూరు

ప్రపంచ శాంతికే ఏసుక్రీస్తు అవతరించాడు

- మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు

రామగిరి(నల్గొండ): ప్రపంచ శాంతి కోసమే ఏసు క్రీస్తు అవతరించాడని మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో సియాన్ యూత్, గ్లోబల్ క్రిస్టియన్ ఎంపవర్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన క్రిస్మస్ కంటాట సెమీ క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచ శాంతితో పాటు సమానత్వాన్ని బోధించేందుకు క్రీస్తు ఎంతగానో పాటుపడ్డారని చెప్పారు. నల్లగొండలో క్రిస్మస్ కంటాట ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. క్రిస్మస్ పర్వదినాన్ని వివరిస్తూ కళాకారులు నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో సియాన్ యూత్ సభ్యులు ప్రేమ్, ప్రదీప్, ప్రవీణ్, ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రేఖల భద్రాద్రి, పాస్టర్లు ఐజాక్ రామ్, మోజెస్, సమర్పన్ కుమార్, డేవిడ్ రాజు, క్రిస్మస్ కాంటాట సభ్యులు హిమచంద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు బస్టాండ్ స్థలం రీ సర్వే


లోకాయుక్త అధికారుల సమక్షంలో బస్టాండ్ స్థలాన్ని సర్వే చేస్తున్న జిల్లా సర్వే అధికారి శ్రీనివాస్

మునుగోడు: వివాదాస్పద మునుగోడులోని బస్టాండ్ స్థలాన్ని లోకాయుక్త అధికారుల సమక్షంలో జిల్లా సర్వే అధికారులు శుక్రవారం రీ సర్వే చేశారు. సర్వే నంబర్ 11లో తనకు పట్టా ఉన్న స్థలంలో బస్టాండ్ నిర్మించారని జేఎన్‌టీయూ మాజీ ప్రిన్సిపాల్ కంచర్ల దశరథరెడ్డి ఐదేళ్ల క్రితం లోకాయుక్త కోర్టుని ఆశ్రయించాడు. విచారించిన న్యాయమూర్తి ఆ స్థలాన్ని దశరథరెడ్డికి ఇప్పించాలని ఏడాది క్రితం తీర్పు చేప్పారు. అనంతరం సర్వే అధికారులు సర్వే నంబర్ 11కి హద్దులు నిర్ణయించగా ఆర్టీసీ అధికారులు ఆ స్థలాన్ని వదిలేసి ప్రహరీ నిర్మించుకున్నారు. అయితే, సర్వే అధికారులు తమకు సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా హద్దులు నిర్ణయించి ఆర్టీసీ అధికారులకు లాభం చేకూర్చారని దశరథరెడ్డి తిరిగి లోకాయుక్త కోర్టుని ఆశ్రయించడంతో న్యాయమూర్తి లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ తాజుద్దీన్‌ను స్థల పరిశీలన చేయాలని ఆదేశించారు. జిల్లా సర్వే అధికారి శ్రీనివాస్‌తో లోకాయుక్త అధికారులు, ఆర్టీసీ అధికారులతో పాటు దశరథరెడ్డి కుటుంబ సభ్యుల సమక్షంలో రీసర్వే చేశారు. సర్వేలో గతంలో నిర్ణయించిన హద్దుల్లో తేడాలు ఉన్నాయని దశరథరెడ్డికి మరికొంత స్థలం వస్తుందని నిర్ధారించారు. సర్వే అధికారులు ఇచ్చిన నివేదికని లోకాయుక్త న్యాయమూర్తులకు అందజేస్తానని డిప్యూటీ డైరెక్టర్ తాజుద్దీన్ తెలిపారు. రీ సర్వేలో లోకాయుక్త అధికారులతో పాటు ఆర్టీసీ ఏఎంటీ హుస్సేన్, డీఈ అంజయ్య, ఏఈ అశోక్ కుమార్, ఆర్ఐ రామచంద్రం, సర్వేయర్ జ్యోతి ఉన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించొద్దు


కానిస్టేబుళ్లకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ రవి

మునుగోడు: అలసత్వం ప్రదర్శించకుండా క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని నూతన కానిస్టేబుళ్లకు ఎస్ఐ రవి సూచించారు. ఏడాది పాటు శిక్షణ పొంది మునుగోడు పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల విధుల్లో చేరిన నూతన కానిస్టేబుళ్లకు శుక్రవారం ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వారం రోజుల క్రితం వరకు స్టేషన్‌కు మొత్తం 25 మందిని నియమిస్తే అందులో సగం మంది నల్లగొండ, ఇతర ప్రాంతాలల్లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఉన్న 13 మందితో మండలంలోని ప్రజలకు పోలీసు సేవలు అందించేందుకు అధికారులు కాస్త ఇబ్బంది పడేది. ఇటీవల జిల్లాలోని పోలీస్ స్టేషన్లకు నూతన కానిస్టేబుళ్లను నియమించడంతో మునుగోడు స్టేషన్‌కు 8 మందిని నియమించారు. దీంతో స్టేషన్ సిబ్బంది సంఖ్య 34కి చేరింది. అందులో ఇద్దరు ఏఎస్ఐలు, 4 హెడ్ కానిస్టేబుల్స్, 28 మంది కానిస్టేబుల్స్ ఉండగా 13 మంది డిప్యూటేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. నూతన కానిస్టేబుల్స్ 8 మందితో పాటు పాత సిబ్బంది 12 మందితో కలిపి ప్రస్తుతం 20 మంది మునుగోడు మండల ప్రజలకు అవసరమైన భద్రత చర్యలు తీసుకుంటున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కట్టంగూర్ మండల విద్యాధికారి అంజయ్య, ఉపాధ్యాయులు

కట్టంగూర్ : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 17న హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద ధర్మాగ్రహ దీక్ష చేపడుతున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని భాస్కర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీపీయూఎస్ నాయకులతో కలిసి ఎంఈఓ అంబటి అంజయ్య దీక్ష పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీయూఎస్ నాయకులు పాండరి, కేతేపల్లి, నకిరేకల్, శాలిగౌరారం, కట్టంగూర్ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంజయ్యకు గద్దర్ జాతీయ సేవా పురస్కారం


అవార్డు అందుకుంటున్న బండమీది అంజయ్య

నల్లగొండ టౌన్: కనగల్ మండలం బండమీదిగూడెం గ్రామానికి చెందిన బండమీది అంజయ్యకు గద్దర్ జాతీయ సేవా పురస్కారం దక్కింది. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఏపీలోని మమతా స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా శుక్రవారం గన్నవరంలో ఆయన అవార్డు అందుకున్నారు. ఫ్లోరైడ్ రహిత నీళ్ల కోసం నాలుగు దశాబ్దాలుగా జలసాధన సమితి ఆధ్వర్యంలో అంజయ్య పోరాటం చేశారు. సమాచార హక్కు సంరక్షణ సమితి స్థాపించి రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతూ ఉచిత విద్య, వైద్యం కోసం ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహించినందుకు ఈ అవార్డు దక్కినట్లు అంజయ్య పేర్కొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి


కట్టంగూర్ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

కట్టంగూర్ : ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి దరఖాస్తులతో పాటు పలు రికార్డులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి పెండింగ్ సమస్యలను వెంటనే పరిశీలించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నేడు లోక్ అదాలత్

కేతేపల్లి: రాజీమార్గం ద్వారా పలు కేసులను సత్వరమే పరిష్కరించుకునేందుకు శనివారం నకిరేకల్‌లోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని కేతేపల్లి ఎస్ఐ శివతేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొందరపాటులో చేసిన చిన్న నేరాల కేసులను సులువుగా పరిష్కరించుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు.

విద్యార్థినులకు అభినందన


ప్రతిభ చూపిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్

నల్లగొండ రూరల్: పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు వైష్ణవి, కోమల యూనివర్సిటీ యోగాసన చాంపియన్ షిప్‌కు ఎంపికయ్యారు. వారిని శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు అభినందించారు. భువనేశ్వర్‌లో ఈ నెల 24 నుంచి 27 వరకు జరగనున్న పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌చార్జి ఉపేంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం


నకిరేకల్‌లో సర్వే చేస్తున్న అధికారులు


తిప్పర్తి : సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నకిరేకల్ : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నకిరేకల్ మున్సిపాలిటీలోని 1వ వార్డులో స్థానిక కౌన్సిలర్ కందాల భిక్షంరెడ్డి ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం ఇంటింటి సర్వే చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు పెట్టుకున్న వారి వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలో వార్డు అధికారిణి జ్యోతి, అశోక్‌రెడ్డి ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

తిప్పర్తి : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శుక్రవారం తిప్పర్తి గ్రామపంచాయతీలోని ఎస్సీ కాలనీలో మండల అభివృద్ధి అధికారి వెంటేశ్వర్‌రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేను వేగవంతం చేసి ఈనెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నర్సింహస్వామి ఉన్నారు.

సిమెంటు ఫ్యాక్టరీని సందర్శించిన విద్యార్థులు


సిమెంటు ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న విద్యార్థులు

నార్కట్‌పల్లి : బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అనే కేంద్ర నాణ్యతా ప్రమాణాల సంస్థ వారు శుక్రవారం నార్కట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 40మంది విద్యార్థులతో కలిసి సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలంలోని ప్రియా సిమెంటు ఫ్యాక్టరీని సందర్శించారు. విద్యార్థుల్లో జ్ఞానాన్ని, పరిశీలన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఫ్యాక్టరీని సందర్శించినట్లు ఆ సంస్థ వారు పేర్కొన్నారు. విద్యార్థులకు ఫ్యాక్టరీ గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, పీడీ రామస్వామి, వెంకట్‌రాజ్ వివరించారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్ష


నల్లగొండలోని కలెక్టరేట్ ఎదుట దీక్షలో కూర్చున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

నల్లగొండ: జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్ష శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులను క్రమబద్ధీకరించి, పే స్కెల్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి – సమాన వేతనం వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం హామీ ఇచ్చే వరకు నిరవధికంగా దీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మొలుగూరి కృష్ణ, బొమ్మగాని రాజు, క్రాంతికుమార్, కంచర్ల మహేందర్, నీలాంబరి, కొండ చంద్రశేఖర్, గుమ్మల మంజులారెడ్డి, సావిత్రి, పుష్పలత, సాయిల్, వెంకట్, వెంకటేశ్వర్లు, ఎర్రమల్ల నాగయ్య, చందపాక నాగరాజు, బంటు రవి, లలిత, కొండయ్య, యాదయ్య, యాట వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు మద్దతు


సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు

సమస్యల పరిష్కారానికి నల్లగొండలోని కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ శుక్రవారం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంపెల్లి భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను చర్చలకు పిలిచి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


నల్లగొండలోని సుభాష్ విగ్రహం వద్ద దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : అనారోగ్యంతో బాధపడుతున్న లగచర్ల రైతు వీర్యానాయక్‌కు పోలీసులు బేడీలు వేయడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు శుక్రవారం నల్లగొండలోని సుభాష్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ లగచర్లలో రైతుభరోసాపై ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే గిరిజన రైతును అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపారని ఆరోపించారు. గిరిజన రైతు అనారోగ్యం బారిన పడితే బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లడం సిగ్గుచేటన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయని ప్రభుత్వ పెద్దలు అక్రమంగా అరెస్ట్ చేయించి నిర్బంధించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పిల్లి రామరాజుయాదవ్, పోతెపాక సాంబయ్య, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, కర్నాటి వెంకటేశం, రావెళ్ల కాశమ్మ, గుండా నవీన్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరణ


చైర్ పర్సన్ గుత్తా మంజుల

నకిరేకల్: ఇటీవల నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్‌గా నియామకమైన గుత్తా మంజుల మాధవరెడ్డి శుక్రవారం స్థానిక మార్కెట్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. త్వరలో నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం అట్టహాసంగా నిర్వహించనున్నారని మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శ్రీనాథ రాజు విలేకరులకు తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్‌కు సన్మానం


వైస్ చైర్మన్ సోమయ్యను సత్కరిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యేవేముల వీరేశం

నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్‌గా నియామకమైన దూలం సోమయ్య, మార్కెట్ డైరెక్టర్ ఎస్‌కే లతీఫ్ శుక్రవారం ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసుపాదం, నాయకులు లింగాల వెంకన్న, గాదగోని కొండయ్య, ఆవుల వేణు తదితరులు ఉన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్ : క్రీడలతో క్రీడాకారుల మధ్య స్నేహభావం పెంపొందుతుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం కట్టంగూర్ మండలంలోని ఎరసానిగూడెంలో మదర్ థెరిస్సా రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్యగౌడ్, మిట్టపల్లి శివ, ఎంటీఆర్‌డీఎస్ వ్యవస్థాపకుడు పాలెలెట్టి జూలియస్, జోసఫ్, విక్రమ్‌సాగర్, చెరుకు యాదయ్య, కొమ్మనబోయిన శంకర్, గంగదేవి ఆంజనేయులు, యాపాల రాఘవరెడ్డి, కాసర్ల శ్రీనివాసరెడ్డి, చెరుకు నర్సింహ, ఐతగోని సైదులు, వస్తుప్పల అంజయ్య ఉన్నారు.


కట్టంగూర్ మండలం ఎరసానిగూడెంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

ఆర్థికసాయం అందజేత

చండూరు : గట్టుప్పల మండలం వెల్మకన్నె గ్రామానికి చెందిన ఏర్పుల రాములు (70) అనారోగ్య సమస్యలతో శుక్రవారం మృతిచెందాడు. అతడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రావుల రమేష్ రూ.5000 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, వెల్మకన్నె గ్రామ శాఖ అధ్యక్షుడు నూర్ మహ్మద్, టేకుమట్ల శ్రీరాములు, భీమనపల్లి పెంటయ్య, యాదగిరిరెడ్డి, భీమనపల్లి యాదయ్య, దిలీప్‌కుమార్, షేక్ సైదులు, భీమనపల్లి యాదయ్య, నరసింహ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

చండూరు(గట్టుప్పల్) : విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నామని జగన్నాథం అన్నారు. ఆయన శుక్రవారం గట్టుప్పల్ మండలంలోని అంతపేట గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కంచుకంట్ల సంపత్‌తో కలిసి విద్యుత్ మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో దాసరి ఐలయ్య, మాదగాని శేఖర్, బీనపల్లి సైదులు, చందా వెంకటేశం, మాదగోని విజేందర్, ఈశ్వరచారి, వెంకటయ్య, అయితగోని శ్రీను, అయితగాని వెంకట్, భుజంగం, యాదయ్య, మోతిలాల్, ముత్తయ్య, అంజయ్య, ఎట్టయ్య తదితరులు పాల్గొన్నారు